క్లుప్తంగా

యాసంగి పంటల నమోదు

రాయికోడ్(అందోల్): యాసంగి సీజన్‌లో సాగుచేస్తున్న పంటల వివరాల నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ తెలపారు. మండల పరిధిలోని ఇందూర్, నాగస్‌పల్లి గ్రామాల్లో పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల పేర్లు, సాగుచేస్తున్న పంటలు, సర్వే నంబర్లు, సాగు విస్తీర్ణం తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం అభినాష్‌వర్మ మాట్లాడుతూ పంట ఉత్పత్తుల విక్రయ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పంటల నమోదు ప్రక్రియ ఉపయోగపడుతుందని తెలిపారు.

బీఎల్‌ఓలకు శిక్షణ



బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌ఓలకు మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గ అధికారులు చంద్రారెడ్డి, మోగిబాబు రాబోయే స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీకి చెందిన ఎండీ ముబారక్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బొల్లారం మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డికు ముబారక్ కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో భవానీమాత జాతర



శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని సజ్జరావుపేట తండాలో బంజారల ఆరాధ్యదైవం భవానీమాత, సేవాలాల్ మహరాజ్ జాతరను ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం జాతర ముగింపు సందర్భంగా గిరిజనులు సంప్రదాయ నృత్యాలు చేస్తూ పల్లకీసేవ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మాసాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర పేరుతో అధికారులు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కల్యాణ్ యోజన, దీన్‌దయాల్ అంత్యోదయ అన్నయోజన, పీఎం ఉజ్వల్ యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం విశ్వకర్మ, పీఎం కిసాన్‌సమ్మాన్, కిసాన్‌క్రెడిట్, పోషణ అభియాన్, హర్ ఘర్ జల్ జీవన్‌మిషన్, జన్‌ధన్ యోజన, అటల్ పెన్షన్‌యోజన తదితర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి కీర్తికృష్ణ, వ్యవసాయాధికారి విజయరత్న, తాలెల్మ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ్, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు పరిశీలన

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గానికి ఇటీవల మంజూరైన ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో వివిధ కార్యాలయాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో తుది నిర్ణయం తీసుకొని కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన వివిధ భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం

- అసంపూర్తిగా జోగిపేట మున్సిపల్ భవనం పనులు
- తొమ్మిదేళ్లయినా పూర్తిచేయని కాంట్రాక్టర్
- పశుసంవర్ధకశాఖ భవనంలో విధుల నిర్వహణ
- ఇబ్బందులకు గురవుతున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది
- కాంగ్రెస్ హయాంలోనైనా పూర్తిచేయాలని విన్నపం



పిల్లర్ల దశలో నిలిచిపోయిన మున్సిపల్ భవనం పనులు

జోగిపేట(అందోల్): అందోల్, జోగిపేట గ్రామాలను కలిపి 2013లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందోల్–పురపాలక సంఘాన్ని ఏర్పాటు చేసింది. మొదట్లో పాత పంచాయతీ భవనంలోనే కార్యకలాపాలను నిర్వహించింది. 2014లో ఎమ్మెల్యేగా బాబూమోహన్ ఎన్నికైన సమయంలో నూతన భవన నిర్మాణం పనులకు అప్పటి ప్రభుత్వం రూ.50లక్షలను మంజూరు చేసింది. పంచాయతీ భవనం పక్కనే ఉన్న స్థలంలో మున్సిపల్ భవనాన్ని నిర్మించేందుకు పనులను ప్రారంభించారు. ఈ పనులను లక్ష్మీప్రసన్న కన్‌స్ట్రక్షన్ వారు దక్కించుకొని పునాదుల వరకు పనులు పూర్తి చేసి ఆ తర్వాత పిల్లర్లకు అవసరమైన స్టీల్‌కాలమ్స్‌ను నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి పనులూ చేపట్టలేదు. దీంతో ఎదురుగా ఉన్న పశుసంవర్ధకశాఖ భవనంలోనే కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.

ఇబ్బందులకు గురవుతున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

పశువులకు సంబంధించిన రైతులకు శిక్షణ నిమిత్తం నిర్మించిన భవనంలో తొమ్మిదేళ్లుగా మున్సిపల్ కార్యకలాపాలను కొనసాగిస్తుండడంతో తాము రైతులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు వీలు లేకుండాపోతోందని సంబంధిత శాఖ అధికారులు పలుమార్లు కలెక్టర్‌కు లేఖలు సైతం సమర్పించారు. మా భవనాన్ని మాకు అప్పగించాలని మున్సిపల్ అధికారులకు కూడా విజ్ఞప్తి చేశారు. దీంతో తమకు ఎక్కడా భవనం అందుబాటులో లేదని, కొత్త భవనం నిర్మించేవరకు అవకాశం ఇవ్వాలని మున్సిపల్ అధికారులు వివరణ ఇచ్చారు.

పిచ్చిమొక్కల దర్శనం

తొమ్మిదేళ్ల క్రితం మున్సిపల్ భవన నిర్మాణాన్ని ప్రారంభించి అసంపూర్తిగా వదిలివేయడంతో ఆ స్థలంలో ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి పునాదులు కనబడకుండాపోయాయి. కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయి. సదరు కాంట్రాక్టర్‌కు 14వ ఫైనాన్స్ నిధుల్లో నుంచి రూ.16 లక్షలు కేటాయించారు. కానీ..భవనాన్ని పూర్తి చేయించేందుకు మాత్రం అధికారులు, పాలకవర్గం తగిన శ్రద్ధ కనబరచలేదని, కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇప్పించేందుకు పాలకవర్గం చూపిన శ్రద్ధ పనులు పూర్తిచేయించడంలో కనబరచలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

నిధులు లేవు

మున్సిపల్ భవన నిర్మాణానికి గతంలో 14వ ఫైనాన్స్ ద్వారా నిధులు కేటాయించారని, ప్రస్తుతం ఆ పద్దు కింద నిధులు అందుబాటులో లేవు. నూతన భవనాన్ని వేరొకచోట నిర్మించేందుకు టీఎఫ్ఐడీసీ నిధుల ద్వారా రూ.4కోట్లతో నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలను ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పంపించాం. కానీ ఇప్పటివరకు నిధులు మంజూరు రాలేదు. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తాం.

– విఠోభ, మున్సిపల్ ఏఈ, జోగిపేట

మున్సిపల్ కార్మికుల నిరసన



మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: వేతనాలు పెంచాలని ఖేడ్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న 80మంది కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికుల సంఘాల నాయకులు చిరంజీవి, సాయిలు, కుమార్, నారాయణ, సిద్దమ్మ, శకుంతల, రవి, పవన్, రాజు, యేసు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో గురుకులం విద్యార్థి ప్రతిభ



అరుణ్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

హత్నూర(సంగారెడ్డి): సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు హత్నూర గురుకుల పాఠశాల విద్యార్థి ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15నుంచి 18 వరకు కర్ణాటకలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు ప్రతిభ కనబరిచి 3వ స్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణ ఖోఖో జట్టులో హత్నూర గురుకులం విద్యార్థి అరుణ్ (9వ తరగతి)ఉండటం సంతోషకరమన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అరుణ్‌కు ఫీజికల్ డైరెక్టర్ వాసు, ఫీజికల్ ఎడ్యుకేషన్ టీచర్ శాంతి అభినందనలు తెలిపారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

జహీరాబాద్ టౌన్: ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయసేవా అధికార సంస్థ జిల్లా కార్యదర్శి హన్మంత్‌రావు అన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాణిక్‌పాటిల్ అధ్యక్షతన మంగళవారం కోర్టు అవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించి కక్షిదారుల పరస్పర సమ్మతితో కేసులను పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి అనుష, డీఎస్పీ రఘు, బార్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్‌సాగర్, ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్పస్వాములు



శబరిమలకు బయలుదేరుతున్న అయ్యప్పస్వాములు

ఝరాసంగం(జహీరాబాద్): శబరిమలలోని అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు మండలం నుంచి అయ్యప్ప దీక్షాపరులు మంగళవారం తరలివెళ్లారు. కేతకి సంగమేశ్వర ఆలయంలో గురు స్వామి సంగన్నస్వామి ఆధ్వర్యంలో 20 మంది అయ్యప్పస్వాములు పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో ధనసిరి ఆశ్రమ పీఠాధిపతి 108 వీరేశ్వర శివాచార్య మహారాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రుద్రప్పపాటిల్, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, నాయకులు జగదీశ్వర్ పాటిల్, శ్రావణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి కృత్రిమ గర్భధారణ మేలు

వట్‌పల్లి(అందోల్): పశువుల ఉత్తమ జన్యు లక్షణాలను అభివృద్ధి చేసి పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు మేలు రకమైన పశు సంపద కోసం కృత్రిమ గర్భధారణ చేస్తున్నట్లు జోగిపేట పశుసంవర్ధక ఏడీ బాలాజీ అన్నారు. మండల పరిధిలోని పోసానిపేట గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశువు ఎద లక్షణాలను గుర్తించి సకాలంలో ఇన్‌జెక్షన్ వేయించాలని సూచించారు. లేగదూడలకు సకాలంలో నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. గోపాలమిత్ర అర్జునయ్య, వీఏ కీర్తన సబార్డినేటర్ నాగరాజు, కేఆర్ ప్రభు పాల్గొన్నారు.

కృష్ణస్వామి సేవలు మరువలేనివి

నారాయణఖేడ్: కోరివి కృష్ణస్వామి సేవలు మరువలేనివని ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అల్కారి సత్యనారాయణ, నియోజకవర్గ నాయకులు శంకర్ ముదిరాజ్, రామకృష్ణ ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కొరివి కృష్ణస్వామి 56వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణస్వామి స్వాతంత్ర్య సమరయోధులుగా, ప్రముఖ జర్నలిస్టుగా హైదరాబాద్ నగర మొదటి మేయర్‌గా సేవలు అందించారని కొనియాడారు.

వైకుంఠరథం బహూకరణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్ పంచాయతీకి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వడ్ల బింబాదర్‌చారి తన తండ్రి బ్రహ్మయ్యచారి జ్ఞాపకార్థం వైకుంఠరథాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వంతు సహకారం అందజేయాలని ఉద్దేశంతో వైకుంఠరథం తయారు చేయించి అప్పగించానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ నారాయణ, సర్పంచ్ గంగన్న, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ప్రారంభం

పుల్‌కల్(అందోల్): సింగూరు గురుకుల పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను మంగళవారం ప్రారంభించారు. మండల విద్యాధికారి అంజయ్య, 33 తెలంగాణ బేటాలియన్ సుబేదారు శివశంకర్ ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కిరణ్, ఎస్‌సీసీ కేర్‌టేకర్ శ్రీసాద్, ఎన్‌సీసీ అధికారి భవల్దార్ పాల్గొన్నారు.

రేపు టెక్ ఫెస్ట్

జహీరాబాద్ టౌన్: పట్టణ పరిధిలోని రంజోల్‌లోని శ్రీసంగమేశ్వర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21న జిల్లా స్థాయి సృజన టెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కుమారస్వామి పేర్కొన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించే టెక్ ఫెస్ట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ బస్ మార్గంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సు మార్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

జహీరాబాద్: మాయమాటలతో మైనర్ బాలికను లోబర్చుకున్న యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు(22) అదే గ్రామానికి చెందిన మైనర్ బాలిక(17)ను పెళ్లి చేసుకుంటానని 16న ఇంటి నుంచి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. మంగళవారం ఇద్దరి ఆచూకీ లభించడంతో ఈ మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విడతలవారీగా గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రణాళికబద్ధంగా గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే హాజరు

ఇంద్రేశం పరిధిలోని పీఎస్‌ఆర్ కాలనీలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచ్ నర్సింహులు, డీసీసీబీ డైరెక్టర్ రాఘవేంద్రరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివారెడ్డి, సీనియర్ నాయకులు బండి శంకర్, మాణిక్‌రెడ్డి, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన ఇక్రిసాట్ ప్రతినిధులు

ఇటీవల నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, కృష్ణ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థిని



గిన్నిస్ రికార్డు సాధించిన శివాలి, ఆమె తల్లిదండ్రులు

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయం బీటెక్ పూర్వ విద్యార్థిని (2016–20) శివాలి జోహ్రి శ్రీవాస్తవ, ఆమె తల్లి కవిత జోహ్రి శ్రీవాస్తవ, తండ్రి అనిల్ శ్రీవాస్తవలు 14వ గిన్నిస్ రికార్డు సాధించి చరిత్ర సృష్టించారు. చేతితో తయారు చేసిన 2,700 కాగితం బొమ్మలను ఒకేచోట ఉంచిన ఈ కుటుంబం, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనగా రికార్డు నెలకొల్పారు. చిన్నపాటి రంగు కాగితాన్ని కూడా కళాత్మకంగా మలచగల నేర్పు శివాలీ కుటుంబానికి వరంగా మారింది. ఏకంగా విశ్వ యవనికపై విజయకేతనం ఎగురవేయడానికి తోడ్పడింది. ఏకంగా 14 గిన్నిస్ రికార్డులు, 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులతో పాటు నాలుగు యూనిక్ వరల్డ్ రికార్డులు హైదరాబాద్‌లోని ఒకే కుటుంబానికి రావడం విశేషం. ఇంతకు మునుపు, శివాలి కుటుంబం హ్యాండ్ మేడ్ పేపర్‌తో రూపొందించిన 1,251 విభిన్న బొమ్మలను కొలువుతీర్చి తొలి గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. ఆ తరువాత 7,011 విభిన్న కాగితం పువ్వులను ప్రదర్శించి మలి రికార్డు, 2,111 విభిన్న బొమ్మలు, 3,501 ఆరెగామి వేల్స్, 2,100 ఆరెగామి పెంగ్విన్ 6,132 ఆరెగామి సిట్రస్ (నిమ్మ తొన)లు, 6,100 ఆరెగామి వేల్స్, 2,500 ఆరెగామి పెంగ్విన్, 1,451 ఆరెగామి మాప్లీలు, 2,200 క్విల్లింగ్ డాల్స్, 9,200 ఆరెగామి ఫిష్, 1,993 ఆరెగామి మాప్లీ లీవ్స్‌ను ప్రదర్శనకు ఉంచి ఇప్పటివరకు 13 గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకున్న విషయం విధితమే. మొత్తం 14 గిన్నిస్ రికార్డులను సాధించిన శివాలి, ఆమె తల్లిదండ్రులను గీతం హైదరాబాద్ అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ ఆర్ వర్మ, బీటెక్ తొలి ఏడాది సమన్వయకర్త ప్రొఫెసర్ త్రినాథరావు, గణిత విభాగం అధ్యాపకుడు డాక్టర్ మల్లికార్జున్, వివిధ విభాగాదిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

సిరాజుద్దీన్‌కు ఆత్మీయ వీడ్కోలు



సిరాజోద్దీన్‌ను సన్మానిస్తున్న గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోహీర్(జహీరాబాద్): మండలంలోని దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు సిరాజుద్దీన్ అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. పాఠశాలలో మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులుగా సిరాజుద్దీన్ బాధ్యతలు చేపట్టిన తరువాత దిగ్వాల్ పాఠశాల ఎంతో ప్రగతిని సాధించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలను అధిగమించి ఫలితాలను సాధించిందని గుర్తుచేశారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య 500 దాటిందని వివరించారు. అనంతరం సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు అందించిన సహకారంతోనే సత్ఫలితాలు సాధించగలిగామన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, దిగ్వాల్ మాజీ సర్పంచ్ రామలింగారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రియాజోద్దీన్, ఎంపీటీసీ బక్కారెడ్డి, ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుసేన్, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ పండుగకు వేళాయే..



బాగారెడ్డి స్టేడియం

- వేదిక కానున్న జహీరాబాద్
- ఈ నెల 23 నుంచి టోర్నీ ప్రారంభం
- ఐపీఎల్ తరహాలో జెడ్పీఎల్ పోటీలు
- మూడురోజుల పాటు డే అండ్ నైట్ మ్యాచ్‌లు

జహీరాబాద్: క్రికెట్ పండుగకు జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్ వేదిక కానుంది. ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకు 9వ జెడ్పీఎల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. జహీరాబాద్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొననున్నాయి. మూడురోజుల పాటు డే అండ్ నైట్ పోటీలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిత్యం ఆరు మ్యాచ్‌లను నిర్వహిస్తారు. మొత్తం 40 మ్యాచ్‌లు జరుగుతాయి. టోర్నీలో భాగంగా 10 ఓవర్ల పరిమిత మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. 31న సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు తమ జట్టు తరఫున స్టార్ క్రికెటర్లను సైతం తెచ్చుకునే అవకాశం ఉంది. పోటీలకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన అంపైర్లు రానున్నారు. విన్నర్ జట్టుకు రూ.50వేలు, రన్నర్ జట్టుకు రూ.30వేల నగదు పారితోషికంతో పాటు కప్‌ను అందజేయనున్నారు. ముగింపు కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు హాజరు కానున్నట్లు జహీరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు నయీముద్దీన్ తెలిపారు.